బద్దం బాల్‌రెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకుడు, కార్వాన్ మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి జయంతి వేడుకలను ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సి.ఉదయ్‌కుమార్, నాయకులు జొన్నకుంటి మధుసుదన్, గోదా లక్ష్మీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఫైన్ ఆర్ట్స్, ఫిల్మ్ యాక్టింగ్‌లో శిక్షణ

నాంపల్లి: శిల్పం, చిత్రలేఖనం, రంగస్థల కళల శాఖల ఆధ్వర్యంలో తెలుగు వర్సిటీలో ఫైన్ ఆర్ట్స్, ఫిల్మ్ యాక్టింగ్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న ప్రారంభమై నెల రోజుల పాటు కొనసాగుతాయని పేర్కొన్నారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులకు సర్టిఫికెట్ కూడా ఇస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు రూ.5 వేల ఫీజును రిజిస్ట్రార్, తెలుగు వర్సిటీ పేరిట డీడీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8309011865, 8309498807 (ఫైన్ ఆర్ట్స్), 9346461733 (ఫిల్మ్ యాక్టింగ్) నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఖేలో యూత్ గేమ్స్‌లో 3 పతకాలు



పతకాలతో క్రీడాకారులు

గన్‌ఫౌండ్రీ: బీహార్ రాష్ట్రంలో జరిగిన ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2025 పోటీల్లో తెలంగాణకు 3 పతకాలు లభించాయి. స్విమ్మింగ్ విభాగంలో సుహాస్ 50 మీటర్ల విభాగం, నిత్య సాగికి 400 మీటర్ల విభాగం, సైక్లిస్ట్ తనీశ్‌కుమార్ సింగ్, 200 మీటర్ల స్ప్రింట్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి వారిని అభినందించారు.

రమణీయం అనుశ్రీ భరతనాట్య ఆరంగేట్రం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్యరంగ సంస్థ శ్రీవారి పాదాలు ఆధ్వర్యంలో నృత్య గురువు డాక్టర్ నల్ల రమాదేవి శిష్యురాలు అనుశ్రీ అశ్విన్ భరతనాట్య ఆరంగేట్రం బుధవారం రవీంద్రభారతిలో కనుల పండువగా సాగింది. పుష్పాంజలి, అలరింపు, జతిస్వరం, వర్ణం, బ్రహ్మమొక్కటే, తిల్లానా వంటి పలు అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ... 5 ఏళ్ల నుంచే కూచిపూడి భరతనాట్యం వంటి శాస్త్రీయ సంగీత కళలను నేర్చుకునేందుకు శిక్షణ తీసుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ప్రదర్శనలు ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీనియర్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గిరిజ కృష్ణన్, పి.అనురాధా రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు... ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన రహదారి ఫ్లై ఓవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడని బుధవారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడికి 35 సంవత్సరాల వయస్సు ఉంటుందని.. రోడ్డు దాటే సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదని పోలీసులు వెల్లడించారు.

మాక్‌డ్రిల్ విజయవంతం

తిలకించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు, ప్రజలు

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నానల్‌నగర్ వద్ద బుధవారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను కార్వాన్, నాంపల్లి ఎమ్మెల్యేలు కౌసర్‌మొహియుద్దీన్, ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తిలకించారు. ఎమ్మెల్యే కౌసర్ మాట్లాడుతూ.. మాక్ డ్రిల్ వల్ల భారత సైన్యం గురించి తెలుసుకునే అవకాశంతో పాటు యుద్ధం జరిగేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు తెలిసిందన్నారు. అలాగే సహనానికి కూడా హద్దు ఉంటుందని హెచ్చరికలను పెడచెవినపడితే భారత్ ఊరుకోదని ఉగ్రవాద స్థావరాలపై మన సైన్యం దాడి రుజువు చేసిందన్నారు. కార్యక్రమంలో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ జి.చంద్రమోహన్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులు ఉన్నారు.



ఆసుపత్రిలో సహాయక చర్యలను వివరిస్తున్న సిబ్బంది

పురానీహవేలీలోని ప్రిన్సెసెస్ దర్రెషేహవర్ ఆసుపత్రిలో..

యాకుత్‌పురా: మొఘల్‌పురా అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో పురానీహవేలీలోని ప్రిన్సెసెస్ దర్రెషేహవర్ ఆసుపత్రిలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. క్షిపణి దాడులు జరిగితే తీసుకోవాల్సిన రక్షణ సహాయక చర్యలను అగ్నిమాపక కేంద్రం ఎస్ఎఫ్ఓ వెంకటేశ్వర్ రెడ్డి ఆసుపత్రి సిబ్బంది, రోగులకు వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మెన్, డీఓపీ వినోద్ కుమార్, ఫైర్‌మెన్లు భీంరావు, కరణ్‌సింగ్, మహ్మద్ అబ్దుల్ అర్షద్, లోకేశ్వర్, సుధాకర్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో..

చార్మినార్: పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో బుధవారం మాక్ డ్రిల్ జరిగింది. అగ్నిమాపక సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు ప్రజలను అప్రమత్తం చేశారు. చందూలాల్‌బారాదరి అగ్నిమాపక సిబ్బంది బహదూర్‌పురా క్రాస్ రోడ్డు వద్ద యుద్ధ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



నానల్‌నగర్ వద్ద మాక్ డ్రిల్ తిలకిస్తున్న ఎమ్మెల్యే కౌసర్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



బహదూర్‌పురా చౌరస్తాలో అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు..

'ఎంపీ అసదుద్దీన్ ద్వంద్వ వైఖరి వీడాలి'

చార్మినార్: నగరం నుంచి పాకిస్తానీయుల తరలింపులో ఎంపీ అసదుద్దీన్ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరి వీడాలని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు టి.ఉమామహేందర్ డిమాండ్ చేశారు. పాకిస్తాన్ ఉగ్రదాడులను నిరసిస్తూ పాతబస్తీ పురానాపూల్ వద్ద బుధవారం నిరసన తెలిపి పాకిస్తాన్ జెండాను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పహల్గాం దాడి నిందితులను తుదముట్టించాలని కోరుతూనే..మరోవైపు నగరంలో తిష్టవేసిన పాకిస్తానీయులను వెనక్కి పంపే విషయంలో సంబంధిత అధికారులను ఎంపీ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు వీడి పాకిస్తానీయులను తరిమేసే ప్రక్రియలో భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కె.సురేందర్, దీపక్ కోలా, నట్‌రాజ్ నాందారి, శివ యాదవ్, టి.కునాల్‌రావు, రాము, నరేందర్, రంజిత్ సింగ్, ప్రకాశ్ గౌడ్, బల్వీర్ సింగ్, శశికుమార్, నరేశ్, లక్ష్మీకాంత్, కె.ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



పాకిస్తాన్ జెండాను దహనం చేస్తున్న ఉమామహేందర్ తదితరులు

ఉగ్రవాదులకు గుణపాఠం

గోల్కొండ: 'ఆపరేషన్ సిందూర్' పేరిట భారత సైన్యం ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పిందని న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్ అన్నారు. గోల్కొండ కోట వద్ద పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు 'ఆపరేషన్ సిందూర్' విజయవంతంపై బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాద చర్యలను సహించేది లేదని దీనిద్వారా నిరూపితమైందన్నారు. అలాగే మాక్ డ్రిల్ నిర్వహణతో అనుకోని పరిస్థితుల్లో యుద్ధం వస్తే పౌరులు పాటించాల్సిన జాగ్రత్తలు, సూచనలు తెలుసుకునే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఈ.వెంకటేశ్వర్లు, మైత్రి కమిటీ సభ్యులు ఆబేద్, ఇలియాస్ అలీ, గోల్కొండ గైడ్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మహ్మద్ హర్షద్, తహసీన్ పాషా, చాంద్‌పాషా తదితరులు ఉన్నారు.



గోల్కొండ కోట వద్ద పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు

ఆధ్యాత్మికతతో మానసికోల్లాసం

చార్మినార్: ఆధ్యాత్మికతతో మానసికోల్లాసం కలుగుతుందని మజ్లిస్ ఓబీసీ రాష్ట్ర ఇన్‌చార్జి ఆర్.దీపేశ్ రాజ్ వర్మ అన్నారు. హైదరాబాద్-సికింద్రాబాద్ శ్రీ సోమ క్షత్రియ నకాశ్ సంఘం అధ్యక్షుడు ఎన్.మహేశ్ వర్మ ఆధ్వర్యంలో కుల దేవతైన నింషాంబా దేవీ ప్రతిష్ఠాపన పూజలు బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టిన సామూహిక యజ్ఞంలో ఆయనతో పాటు భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో మజ్లిస్ ఓబీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపేష్ రాజ్ వర్మ తదితరులు

'ఆపరేషన్ సిందూర్' విజయంపై హర్షం

చాంద్రాయణగుట్ట: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి ఘటనకు ప్రతీకారంగా భారత సైన్యం మంగళవారం అర్ధరాత్రి చేపట్టిన ×ఆపరేషన్ సిందూర్ ె విజయవంతం కావడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఆర్మీకి మద్దతుగా చాంద్రాయణగుట్ట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయ నగేశ్ ఆధ్వర్యంలో ఛత్రినాకలో బుధవారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బి.వెంకటేశ్ ముదిరాజ్, అల్లం భాస్కర్, ఎ.మహేశ్ గౌడ్, శ్యాంరావు ముదిరాజ్, మోహన్ రెడ్డి, బావజీర్, హబీబ్, అబ్దుల్లా, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



ఛత్రినాకలో ర్యాలీ తీస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాస్త్రీయ సంగీత కళలను భవిష్యత్ తరాలకు అందించాలి



చిన్నారులతో నాట్య గురువు వేదాంతం రాధేశ్యాం తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సులోచన కళాక్షేత్రం ఏడో వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ మాట్లాడుతూ.. భారతీయ వారసత్వ సంపద అయిన శాస్త్రీయ సంగీత కళలను భవిష్యత్ తరాలకు అందించడంలో కళా సంస్థల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. అంతకుముందు వివిధ అంశాలపై చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే పలువురు నాట్య గురువులను సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రీ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ పల్లె పద్మ, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం సతీశ్, కళాక్షేత్రం వ్యవస్థాపకురాలు వి.రాధిక, డ్యాన్స్ టీచర్ కె.రేవతి పాల్గొన్నారు.

బుర్రా సాయిమాధవ్‌కు పురస్కారం ప్రదానం



బుర్రా సాయిమాధవ్‌కు పురస్కారం అందజేస్తున్న జస్టిస్ రాధారాణి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువ కళావాహిని ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత బుర్రా సాయిమాధవ్‌కు ఆచార్య ఆత్రేయ రచన పురస్కారాన్ని బుధవారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి మాట్లాడుతూ.. ఆత్రేయ రచనలు ఎంతో బాగుంటాయని కొనియాడారు. అంతకుముందు అహో ఆంధ్ర భోజ పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, సాహితీ వేత్త ఓలేటి పార్వతీశం, విశ్రాంత ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సీఎల్ఎన్ గాంధీ, కళారత్న ఎస్వీ రామారావు, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాజీ సీఎం దామోదరం సంజీవయ్య వర్ధంతి

అబిడ్స్: మాజీ సీఎం దామోదరం సంజీవయ్య వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎదుట ఆయన విగ్రహం వద్ద ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ కన్వీనర్ నిర్మల్‌కుమార్ యాదవ్, ఇతర కాంగ్రెస్ నేతలు ఎం.శ్యామ్‌రావు, మహ్మద్ అలీ జమీల్, రమణారెడ్డి, తిలక్ సింగ్, విశ్వేశ్వర్‌రావుల పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఏఐసీసీ ఓబీసీ సెల్ కన్వీనర్ నిర్మల్‌కుమార్ యాదవ్ తదితరులు

'చిరుకథల చిద్విలాసం' గ్రంథావిష్కరణ

నాంపల్లి: జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక బ్రహ్మ గుడిబండి వెంకటరెడ్డి సంపాదకత్వంలో సాహితీకిరణం ప్రచురించిన 'చిరుకథల చిద్విలాసం' పోస్ట్‌కార్డు కథలు గ్రంథావిష్కరణ సభను మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీ గాయత్రీ సదనంలో బుధవారం నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన సభకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.వి.రమణ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు.ఈ గ్రంథాన్ని వడ్లకొండ వెంకటరావుకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ, యువ కళావాహినీ సంస్థ అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ, సాహితీ కిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో సంగీత గురువు కె.సుప్రియ చక్రవర్తి శిష్య బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం అలరించింది.



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, వెంకట్‌రెడ్డి, ఓలేటి పార్వతీశం

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు

సుల్తాన్‌బజార్: గోషామహల్ నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ-14వ సర్కిల్ ఏసీపీ మంజుల సింగ్, సెక్షన్ ఆఫీసర్ నరేశ్, చైన్‌మెన్ ఆరీఫ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ కార్పొరేటర్లు రాకేశ్ జైస్వాల్, శంకర్ యాదవ్, లాల్‌సింగ్, దర్శన్, ఇతర కార్పొరేటర్ల భర్తలు బుధవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎవరైనా భవనం కడితే చాలు అక్కడికి జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు వెళ్లి భవన యజమానిని అనుమతుల పేరిట వేధిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి భవన యజమానులను గురిచేసే వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌కు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన నాయకులు

గోల్కొండ: టోలిచౌకీ అజీజ్‌బాగ్ కాలనీలోని టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేశ్ నాయను పలువురు మజ్లిస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మొదటి ఇన్‌స్పెక్టర్‌గా నియామకం కావడంతో ఆయనను అభినందించారు. కలిసిన వారిలో మహ్మద్ ముస్తఫా, మిర్జా అహ్మద్ బేగ్, ఉమర్ తదితరులు ఉన్నారు.



టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేశ్‌నాయక్‌తో మజ్లిస్ నాయకులు

భక్తిశ్రద్ధలతో కన్యకా పరమేశ్వరి జయంతి

దూద్ బౌలి: కన్యకా పరమేశ్వరి దేవి జయంతిని పురస్కరించుకొని దూద్ బౌలి వాసవి భవనంలో దూద్ బౌలి ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు గోరటి పద్మజ ఆధ్వర్యంలో బుధవారం పలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు కుంకుమార్చన చేశారు. అనంతరం బస్తీవాసులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో వాసవి భవనం అధ్యక్షుడు దొరేటి ఆనంద్ గుప్తా, సంఘం ప్రధాన కార్యదర్శి బి సంతోష్, కోశాధికారి జి సీతారాం, వీరేష్, వంశీకృష్ణ, కూన లక్ష్మణ్, రమేశ్, రాధిక, ఆదాయ పన్ను శాఖ అధికారి ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్

యాకుత్‌పురా: రెయిన్‌బజార్ డివిజన్‌లోని ముర్తుజానగర్, ఎస్ఆర్టీ కాలనీ ప్రాంతాల్లో యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్‌లో కలిసి రూ 22 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక మజ్లిస్ నాయకులు, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

మెట్రోచార్జీ పెంపు ఆలోచనను విరమించుకోవాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న హన్మేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ మెట్రో చార్జ్ పెంపు ఆలోచనను విరమించుకోవాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి హన్మేష్ కోరారు. బుధవారం రాంనగర్‌లోని మార్క్స్ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హన్మేష్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 3 లైన్లుగా నడుస్తున్న మెట్రోరైల్‌లో రోజుకు రూ.5 లక్షలకు పైగా ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నారన్నారు. మెట్రో నష్టాలతో నడుస్తున్నదనే నెపంతో ప్రయాణికులపై చార్జీల భారం మోపాలని ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతుందన్నారు. ఒక వేళ అలాంటి ప్రయత్నమే జరిగితే వెంటనే విరమించుకోవాలని కోరారు. ప్రభుత్వాలు రవాణా వ్యవస్థను సులభతరం చేయాల్సింది పోయి ప్రజలపై ఆర్థికభారాన్ని మోపడం సరికాదన్నారు. వివిధ సంఘాల నాయకులు వెంకటేష్, ఝాన్సీ, తేజు, విజయ్, ఎస్ఎల్.పద్మ, కేఎస్.ప్రదీప్, ప్రవీణ్, రవి తదితరులు పాల్గొన్నారు.

బాలుడిపై కత్తితో దాడి

రాజేంద్రనగర్: బాలుడిపై యువకుడు కత్తితో దాడి చేసిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో సమాచారం మేరకు.. ఉప్పర్‌పల్లికి చెందిన బాలుడు (16) మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటి వద్ద నిలబడి ఉన్నాడు. అదే ప్రాంతానికి చెందిన నవీన్(22) కత్తితో బాలుడిపై దాడి చేయగా మనీష్ కింద పడటంతో స్థానికులు గమనించి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మనీష్ ఆస్పత్రిలో కోలుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. నవీన్‌ను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్ ఆత్మహత్య

రాజేంద్రనగర్: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాజేంద్రనగర్ ఎస్ఐ మామిడి కిశోర్ సమాచారం మేరకు... గాంధీనగర్‌కు చెందిన మహేందర్(35) డ్రైవర్. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

రూ.1.57లక్షల విలువైన గంజాయి స్వాధీనం

అంబర్‌పేట: గుట్టుచప్పుడు కాకుండా రైల్లో గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం కాచిగూడ రైల్వే పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్ఏన్.జావేద్, ఇన్‌స్పెక్టర్ ఎల్లప్పలు వివరాలను వెల్లడించారు. ఒడిశాకు చెందిన గుల్బామ్ గ్రామానికి చెందిన దుర్యోధన్ చంప్తి కుమారుడు భగవాన్ చంప్తి(23), సుమంత మహంతి(24) స్నేహితులు. కాగా వీరు కొన్ని నెలలుగా విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలించి షాద్‌నగర్‌లో ఉండే స్నేహితుడికి అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం విశాఖపట్నం - కాచిగూడ రైల్లో వచ్చి కాచిగూడ స్టేషన్‌లో దిగి అనుమానాస్పదంగా కనిపించారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప సిబ్బందితో కలిసి వారి వద్ద తనిఖీ చేయగా రూ.1.57లక్షల విలువ చేసే 3కిలోల గంజాయి లభ్యమైంది. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. అసలు సూత్రధారి భవన్ సుబుది అని తేలిందన్నారు. ప్రస్తుతం అతడు పరారీలో ఉన్నట్లు చెప్పారు.

